



**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ - శనివారం
సాయంత్రం - 6.32

సహర్ - ఆదివారం
ఉదయం - 5.01



బీరప్ప ఆలయం వద్ద బోనాలతో మహిళల ప్రదక్షిణలు

## బీరప్పకు బోనాలు

పూడూరు మండలం చీలాపూర్ గ్రామంలో బీరప్ప జాతర ఘనంగా జరిగింది. శుక్రవారం ఉదయం నుంచే గ్రామస్తులు బీరప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించారు. పాడి పంటలు బాగుండాలని మొక్కుకున్నారు.

- పూడూరు, మార్చి 15


## పది ప్రశ్నాపత్రాలు వచ్చేశాయ్!

18వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షలకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. తాండూరు మండలంలోని కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లో పదోతరగతి ప్రశ్నాపత్రాలను భద్రపరిచారు. కాగా శుక్రవారం తాండూరులో ఏర్పాటు చేసిన పరీక్షాలను కేంద్రాలను మండల విద్యాధికారి వెంకటయ్య పరిశీలించారు. మండల పరిధిలో 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

- తాండూరురూరల్, మార్చి 15



కరన్‌కోట్ పోలీసుస్టేషన్‌లో పదోతరగతి ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న సిబ్బంది



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక రోజు ముందు ఎమ్మెల్సీ కవిత అరెస్టుతో బీఆర్‌ఎస్ నేతలు కంగుతిన్నారు. దీంతో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఎన్నిరోజులు ఇందులో ఉంటారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పార్లమెంటు ఎన్నికల వేళ బీఆర్‌ఎస్‌కు చెందిన కీలక నేతలు అధికార కాంగ్రెస్, బీజేపీల వైపు చూస్తున్నారు

# బీఆర్‌ఎస్‌కు గడ్డుకాలం!

## కాంగ్రెస్, బీజేపీ వైపు చూస్తున్న గులాబీ నేతలు

- 18న భారీ చేరికలకు ప్లాన్?
- మాజీ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారంటూ ప్రచారం
- ప్రచారాన్ని కొట్టివేస్తున్న మల్లారెడ్డి, రంజిత్‌రెడ్డి
- బీజేపీ గూటికి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఉమ్మడి జిల్లాలో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ మునుపెన్నడూ లేని విధంగా గడ్డుకాలం ఎదుర్కొంటోంది. ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు చెందిన కీలక నేతలు అధికార కాంగ్రెస్, బీజేపీలవైపు చూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ పరిస్థితి రోజురోజుకు దిగజారుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్లతో పాటు మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి అధికార పార్టీలో చేరారు. వీరి బాటలో మరికొందరు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తాజాగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేయడం కలకలం రేకెత్తిస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక రోజు ముందు జరిగిన అనూహ్య పరిణామంతో బీఆర్ఎస్ నేతలు కంగుతిన్నారు. ప్రస్తుత పరిణామాలు బీఆర్ఎస్‌ను తీవ్ర కలవరం పెడుతున్నాయి.

### పార్టీకి దూరంగా...

ఎన్నికల బరిలో దిగేందుకు తహతహలాడి నేతలు ఇప్పటికే చేతులెత్తేసి పార్టీకి దూరంగా ఉంటున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఎన్నిరోజులు ఇందులో ఉంటారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. రెండురోజుల కిందట మాజీ మంత్రి మల్లారెడ్డి తన అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిని వెంటపెట్టుకుని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. వ్యాపార అంశాలపై మాట్లాడేందుకు వెళ్లినట్లు మల్లారెడ్డి చెబుతున్నప్పటికీ కాంగ్రెస్‌లో చేరేందుకే వెళ్లినట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఆయన దీనిపై వివరణ ఇచ్చుకున్నారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని కానీ వచ్చే ఎన్నికల్లో తాను ఏ రాజకీయ పార్టీ నుంచి పోటీ చేయనని తన రాజకీయ వైరాగ్యాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తాజాగా ప్రచారం మొదలైంది. రంజిత్‌రెడ్డి ఇంటికి సీఎం రేవంత్‌రెడ్డి వెళుతున్నట్లు మీడియాలో కూడా కథనాలు వెలువడ్డాయి. అయితే రంజిత్‌రెడ్డి మాత్రం అలాంటిదేమీ లేదంటూ ప్రచారాన్ని ఖండించారు. కానీ ఆయన కొద్ది రోజులుగా బీఆర్ఎస్ నేతలకు దూరంగా ఉంటున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్‌కు సొంత మనిషిగా చెలమణి అయిన ఆయన సిట్టింగ్ స్థానం నుంచి పోటీ చేయనని చేతులెత్తేయడంతో బీఆర్ఎస్ వర్గాలు కంగుతిన్నాయి. అయితే ఆయన కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నట్లుగా కొద్ది రోజుల నుంచి ప్రచారం సాగుతున్నా రంజిత్‌రెడ్డి మాత్రం మనసులో మాట ఇంకా బయటపెట్టడం లేదు.

### జంపింగ్ జపాంగ్?

ఉమ్మడి జిల్లాలోని పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈనెల 18వ తేదీన పెద్ద ఎత్తున చేరికలు ఉండవచ్చని తెలిసింది. అలాగే ఓటమి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్, బీజేపీ వైపు చూస్తున్నారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ బీజేపీలో చేరతారంటూ ప్రచారం సాగుతోంది.

### చేవెళ్ల టికెట్‌పై కాంగ్రెస్ మల్లగుల్లాలు!

ఇదిలా ఉంటే చేవెళ్ల టికెట్ విషయంలో కాంగ్రెస్ మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఇటీవలే పార్టీలో చేరిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి భార్య వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పేరు దాదాపు ఖరారైంది. చేవెళ్ల టికెట్ హామీతోనే ఆమె కాంగ్రెస్‌లో చేరారు. తొలి జాబితాలోనే టికెట్ ప్రకటిస్తామని ప్రచారం చేసుకోవాలని కూడా సూచించారు. అయితే తొలి జాబితాలో ఆమెకు స్థానం దక్కలేదు. చివరి క్షణంలో ఆమె పేరు జాబితా నుంచి తొలగించి పెండింగ్‌లో పెట్టారు. చేవెళ్ల ఎంపీ టికెట్ విషయంలో కాంగ్రెస్ నాయకత్వం వేరే ఆలోచన ఏమైనా చేస్తుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి కోసమే పెండింగ్‌లో పెట్టినట్లుగా కూడా ప్రచారమవుతోంది. అలాగే మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పేరును కూడా పార్టీ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. రెండు రోజుల కిందట జితేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి మీకేమైనా చేవెళ్ల నుంచి పోటీ చేయాలనే ఆసక్తి ఉందా? అని అడిగినట్లు సమాచారం. కానీ ఆయన సునీతారెడ్డి పోటీకి సిద్ధమయ్యారు కదా? అన్నట్లు తెలిసింది.

### సర్వేల ఆధారంగానే..

ఇదిలా ఉంటే.. చేవెళ్ల టికెట్ విషయంలో పోటీ ఉన్న మాట వాస్తవమేనని సర్వేల ఆధారంగానే టికెట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి జరుగుతున్న చేరికలపై కాంగ్రెస్‌పార్టీలో కూడా విస్తృత చర్చ సాగుతోంది. పదేళ్ల పాటు అధికారం చెలాయించిన వారినే తీసుకువచ్చి మళ్లీ టికెట్లు ఇస్తే ఓట్లేసిన ప్రజలు ఏమనుకుంటారు? పార్లమెంట్ ఎన్నికలపై వ్యతిరేక ప్రభావం ఉండే అవకాశాలు కూడా లేకపోలేదని అని ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ అధినాయకత్వం మాత్రం ఆర్థిక, అంగబలం ఉన్న నేతల వైపే మొగ్గుచూపుతున్నట్లుగా తెలుస్తోంది.

## పార్లమెంట్ ఎన్నికల్లో నోడల్ అధికారులదే కీలక పాత్ర

- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 15 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలక పాత్ర అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, అదనపు కలెక్టర్లతో కలిసి ఆయన ఎన్నికల నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నోడల్ అధికారులందరూ వారికి కేటాయించిన అంశాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలని కోరారు. అన్ని విషయాలపై నోడల్ టీములకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని శిక్షణ అధికారికి ఆదేశించారు. ట్రాన్స్‌పోర్ట్‌లో భాగంగా అవసరమైన వాహనాల ఏర్పాటు, అంతరాష్ట్ర సరిహద్దులలో, జిల్లా సరిహద్దు చెక్ పోస్టులలో సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ఇందులో పోలీస్, ఆర్డీవో, ఆర్టీసీ, ఎక్సైజ్ ఉద్యోగులను నియమించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల యాప్‌లతో పాటు, ఎంసీఎంసీ, సి- విజిల్ పై కంప్యూటరైజేషన్ ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వాలని, కంప్యూటరైజేషన్ నోడల్ అధికారికి ఆదేశించారు. పట్టణ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ వీటన్నిటి పై సంబంధిత నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సి విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, తాండూరు ఆర్డీవో శ్రీనివాసులు, నోడల్ అధికారులు, డీఎస్పీలు, సీఐలు, తహసీల్దార్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రసాద్

## ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 15: ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దామని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అడిషనల్ డైరెక్టర్ పి.ప్రసాద్ తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎయిడ్స్ బాధితులను చీదరించుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ నర్సింహరావు, అనురాగ్ యూనివర్సిటీ డీన్ అఫ్ ఇంజనీరింగ్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సి.మల్లేష్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అన్నోజిగూడలో న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

## పేద ప్రజలకు చేయూతనందించేందుకు కృషి

- రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

ఘట్‌కేసర్, మార్చి 15 : దేశంలో అట్టడుగున ఉన్న ప్రజలకు చేయూతనందించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిరంతరం పాటుపడుతున్నాడని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గల బసీదవాఖాన వద్ద ఓఎన్‌జీసీ సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై అందజేసి మాట్లాడారు. దేశం అన్ని రంగాల్లో అబివృద్ధి చెందడానికి ప్రధాన మంత్రి నిత్యం శ్రమిస్తున్నాడని అన్నారు. నాడు మహిళా ఉద్యోగులకు ఆరువారాల ప్రసుతి సెలవులుంటే దాన్ని 24వారాలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రధానంగా దేశంలో పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. పుట్టిన గడ్డ రుణం తీర్చు కోవడానికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పోచారం మున్సిపల్ వైస్ చైర్మన్ నానవత్ రెడ్డియా నాయక్, కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు గొంగళ్ల మహేష్, మెట్టు బాల్‌రెడ్డి, నాయకులు నానావత్ బిక్కు నాయక్, అచ్చిని నర్సింహ, ప్రవీణ్‌రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ స్టడీ సర్కిల్‌ను వినియోగించుకోవాలి

వికారాబాద్, మార్చి 15: మైనార్టీ స్టడీసర్కిల్‌ను అభ్యర్థులు వినియోగించుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డి.సుధారాణి కోరారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1లో అభ్యర్థులకు ఉచిత శిక్షణను అందించనుందన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసుకున్న మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ ఉచిత శిక్షణ 45 రోజులు కొనసాగుతుందన్నారు. మొదటగా దరఖాస్తు చేసుకున్న వంద మంది అభ్యర్థుల వరకే కోచింగ్ ఇవ్వబడుతుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 25వ తేదీ లోగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 9912144364, 9440685713 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ రగడ

మూడుచింతలపల్లి/ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్/మేడ్చల్ టౌన్, మార్చి 15: కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మూడు చింతలపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11గంటలకు చెక్కులను పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి రెండు గంటలు ఆలస్యంగా వచ్చారు. ఎంపీపీ హారికమురళీగౌడ్, జడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి, వైస్ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డిలు సమయానికి వచ్చి మల్లారెడ్డి కోసం ఎదురుచూశారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ విచ్చేసి వేదికపై ఆసీనులయ్యారు. అదేవిధంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సమావేశానికి రావడంతో నాయకులు ఆయనను స్టేజీ పైకి పిలవాలని అధికారులతో వారించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. వజ్రేష్ యాదవ్ ఏహోదాలో వేదికపైకి వచ్చారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. దీంతో లక్ష్మారెడ్డిని స్టేజీ పైకి పిలవడంతో ఇరుపార్టీల కార్యకర్తలు శాంతించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి చెక్కుల పంపిణీ అనంతరం మాట్లాడకుండానే వెళ్లిపోయారు.



మూడు చింతలపల్లిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కాంగ్రెస్ నాయకులు జై..రేవంత్‌రెడ్డి అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. మూడుచింతలపల్లి మండలానికి సంబంధించిన 21 మందికి చెక్కులను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, నర్సింహులు యాదవ్, మల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ జామురవి పాల్గొన్నారు. కాగా, మేడ్చల్‌లో 21 మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, తహసీల్దార్ శైలజ, ఎంపీడీవో, ఎంపీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తూ వేదికపై కూర్చొని చెక్కులు అందజేయడంతో మల్లారెడ్డి వేదికపై మాట్లాడకుండానే కిందికి దిగిపోయారు. అంతేకాకుండా ఘట్‌కేసర్‌లో 15మందికి, పోచారంలో 17మందికి మొత్తం 32 చెక్కులను పంపిణీ చేశారు. పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి 32 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

## ఒకే ఇంట్లో మూడు నెలల్లో ముగ్గురు మృతి

- పేద కుటుంబాన్ని కబళించిన మృత్యువు



నర్సమ్మ, నర్సింహులు, నాగమణి(ఫైల్)

తాండూరు రూరల్, మార్చి 15: ఓ నిరుపేద కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు మూడు నెలల వ్యవధిలో మృతి చెందారు. ఒకరి తర్వాత ఒకరు వరుసగా మృతి చెందడంతో కుటుంబం తీరని దుఃఖంలో మునిగిపోయింది. తాండూరు మండలం అంతారం గ్రామంలో ఈ విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చెంగోల్‌కు చెందిన నర్సింహులు కొన్నేళ్లకిందట అంతారం గ్రామానికి చెందిన నర్సమ్మ(60) కూతురు నాగమణిని వివాహం చేసుకుని ఇల్లరికం ఉంటున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే నర్సమ్మ అనారోగ్యంతో ఈ ఏడాది జనవరి 29న మృతి చెందింది. ఫిబ్రవరి 5వ తేదీన నర్సింహులు అంతారం శివారులోని పాలిషింగ్ యూనిట్‌లో కూలి పనికి వెళ్తుండగా లారీఢీకొని మృతి చెందాడు. తల్లి, భర్తను కోల్పోయిన నాగమణి తీవ్ర మనోవేదనకు గురైంది. కుటుంబ పెద్ద తల్లి, పోషించే భర్త మృతిని జీర్ణించుకోలేక బెంగతో నాగమణి కూడా ఆసుపత్రి పాలై శుక్రవారం మృతి చెందింది. ఒకేఇంట్లో మూడునెలల వ్యవధిలో ముగ్గురు మృతి చెందడంతో పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బాధిత కుటుంబాలకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆయనతో పాటు భూకైలాస్ వ్యవస్థాపకులు వాసుపవార్ నాయక్ రూ.5వేలు, మార్కెట్ కమిటీ మాజీ చైరన్ వడ్డెశ్రీనివాస్ రూ.2వేలు, మాజీ సర్పంచ్‌శేఖర్ రూ.2వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

## కష్టపడి పనిచేసే వారికి బీజేపీలో గుర్తింపు

మేడ్చల్ టౌన్, మార్చి 15: కష్టపడి పనిచేసే వారికి తప్పనిసరిగా పార్టీలో గుర్తింపు లభిస్తుందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొరిపర్తి రమేష్ ముదిరాజ్, గౌరయ్యగారి శ్రీనివాస్ గౌడ్, మాసాని శ్రీశైలం, కుమ్మరి నర్సింహాచారి, హర్షద్, శంకర్‌గౌడ్‌లు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల పార్టీలో చేరిన వారికి కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

వికారాబాద్, మార్చి 15: వినియోగదారుల హక్కులను కాపాడే బాధ్యత అంద రిదని జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్ అన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ

## హక్కులను కాపాడే బాధ్యత అందరిదీ

అధికారి కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్స వాన్ని పౌరసరఫరాల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎస్‌వో రాజేశ్వర్ మాట్లాడుతూ.. ప్రయోజనాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించాలన్నారు. 1986లో వినియోగదారుల చట్టం వచ్చిందన్నారు. ఈ చట్టాన్ని 2019లో మార్పుచేసి వినియోదారుల హక్కుల పరిరక్షణకు చట్టంగా రూపొందించినట్లు తెలిపారు. విని యోగదారులు రాయితీలు, ఉచిత ప్రకటనలను ఆన్‌లైన్‌లో చూసి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు చేసే వస్తువు తయారీ చిరునామా, గడువు తేదీలను చూసు కోవాలని తెలిపారు. రైతులు విత్తనాలు, మందులు కొనేటప్పుడు బోగస్ కంపెనీ పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. కొనుగోలు చేసిన వస్తువులకు తప్పకుండా రసీదు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుగు ణబాయి, లీగల్ మెట్రాలజీ అధికారులు, రైస్‌మిల్లర్లు, చౌకధరల దుకాణాల డీలర్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలు ఎక్స్‌గ్రేషియా పొందాలి

వికారాబాద్, మార్చి 15: ప్రమాదవశాత్తు మృతిచెందిన కార్మికుల కుటుంబసభ్యులు, దివ్యాంగ కార్మికులు ఎక్స్‌గ్రేషియాను పొందాలని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు కేంద్రకార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన ఈశ్రమ్‌పోర్టల్‌లో పేరునమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 2022 మార్చి 31 వరకు ఈశ్రమ్ పోర్టల్ పేరు నమోదు చేసుకోవాలన్నారు. మృతుల కుటుంబానికి రూ.2లక్షలు, దివ్యాంగులకు రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా ఎక్స్‌గ్రేషియా అందుతుందన్నారు. కలెక్టరేట్‌లోని సహాయ కార్మిక కమిషనర్‌లో సంప్రదించాలన్నారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాలకు కార్యాలయం పనివేళలో వచ్చి సమర్పించాలన్నారు.

## సమాజంలో మహిళాశక్తి చాలా గొప్పది



పరిగిలో మహిళలను సన్మానిస్తున్న మెపా రాష్ట్ర నాయకులు

పరిగి, మార్చి 15: సమాజంలో మహిళా శక్తి చాలా గొప్పదని, పట్టుదల, ఆత్మస్థైర్యంతో అన్నిరంగాల్లో రాణించాల్సిన అవసరముందని ముదిరాజ్ ఎంప్లాయీస్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు డాక్టర్ బి.జగన్మోహన్, మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సంజీవ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.రామాంజనేయులు, దుద్యాల వెంకటయ్యలు అన్నారు. మెపా ఆధ్వర్యంలో శుక్రవారం పరిగి మండలం సయ్యద్ మల్కాపూర్‌లో ముదిరాజ్ సంఘం కార్యాలయంలో మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు దేనిలో తక్కువ కాదని, పురుషులతో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. ఏవిజయం వెనుకైనా మహిళ పాత్ర ఉంటుందన్నారు. ముదిరాజ్ మహిళలూ అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. మెపా మహిళలకు అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందని తెలిపారు. జనాభా ప్రకారం ముదిరాజ్‌ల వాటా కోసం ఐక్యంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. డీసీఎంఎస్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన డి.వెంకటయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.విజయ్‌కుమార్, కార్యదర్శులు వెంకటయ్య, మొగులయ్య, ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామస్వామి, చందుముదిరాజ్, దోమ మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, పీఆర్టీయూ తాలూకా అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు గోవర్దన్, రమణ పాల్గొన్నారు.

# నంబర్లను వెల్లడించలేదేం?



(మొదటి పేజీ తరువాయి)

గతంలో కోర్టుకు సమర్పించిన వివరాలను ఈసీ భద్రపర చాలని కూడా కోర్టు ఆదేశించింది. ఈ మేరకు గురువారం తమ వెబ్‌సైట్‌లో బాండ్ల వివరాలను అప్‌లోడ్ చేసిన ఈసీ.. విరాళాల తాలూకు పత్రాలు కోర్టు వద్దే ఉన్నాయని, వాటిని తిరిగి అప్పగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించింది. ఈ మేరకు ఇటీవలి తీర్పు అమలుకు సంబంధించి స్వల్ప సవరణలు కోరుతూ దరఖాస్తు దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీ వై చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ ఎస్బీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎస్బీఐ తరఫున ఎవరు వాదనలు వినిపిస్తున్నారు? ఇంతకుముందు మేం ఇచ్చిన తీర్పులో.. బాండ్లను కొన్న వారెవరు? బాండ్ విలువ ఎంత? ఏ రోజున కొన్నారు? వంటి అన్ని వివరాలను వెల్లడించాలని స్పష్టంగా పేర్కొన్నాం. కానీ, ఆ వివరాలేమీ తెలియజేయలేదు. బాండ్ల నెంబర్లను కూడా వెల్లడించలేదు' అని పేర్కొన్నారు. ఈ వివరాలన్నింటినీ తెలియజేయాల్సిందేనని స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా ఈసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాజకీయపార్టీలకు విరాళాలకు సంబంధించిన వివరాల సీల్డ్ కవర్లను సుప్రీంకోర్టుకు గతంలో సమర్పించామని, వాటి తాలూకు మరొక కాపీ తమ వద్ద లేదని తెలిపారు. ఈ పత్రాలను భద్రపర్చాలని సుప్రీంకోర్టు మార్చి 11 నాటి తీర్పులో తమను ఆదేశించినందున, ఆ సీల్డ్ కవర్ పత్రాలను తమకు తిరిగి అప్పగించాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. సదరు పత్రాల కాపీలు ఈసీ వద్ద ఉన్నాయని భావించి, వాటిని భద్రపరచమని ఆదేశించామని పేర్కొంది. ఆ పత్రాలను స్కాన్ చేసి డిజిటైజ్ చేయాలని, అనంతరం ఒరిజినల్ పత్రాలతోపాటు ఒక డిజిటల్ ఫైల్ కాపీని కూడా ఈసీకి అందజేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ పని శనివారం సాయంత్రం ఐదు గంటల లోపు జరగాలని, అదే రోజుగానీ మరుసటి రోజుగానీ ఆ పత్రాలను కూడా ఈసీ తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తాను కేంద్రం తరఫున మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నానని, ఎస్బీఐ తరఫున కాదని ధర్మాసనానికి విన్నవించగా.. విచారణ జరుగుతున్న సమయంలో వారు (ఎస్బీఐ తరఫు న్యాయవాదులు) కూడా ఇక్కడ ఉండాలి అని ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు ఎస్బీఐకి నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.

### నేపథ్యం ఇదీ..

రాజకీయపార్టీలు తమకు అందే విరాళాల గురించి పూర్తి వివరాలను ఈసీకి సీల్డ్ కవర్‌లో అందజేయాలని సుప్రీంకోర్టు 2019 ఏప్రిల్ 12న మధ్యంతర ఉత్తర్వులను వెలువరించింది. గత ఏడాది నవంబరు 2వ తేదీన కూడా ఇదే కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు.. ఈసీ సీల్డ్ కవర్లు, సీల్డ్ బాక్సులను సుప్రీంకోర్టుకు గతంలో అందజేసింది.

# ఎలక్టోరల్ బాండ్లతో బీజేపీ 'క్విడ్ ప్రో కో'

## స్వతంత్ర భారత్‌లో అతిపెద్ద కుంభకోణం

- బీజేపీ అవినీతి వ్యూహాలు బహిర్గతం: కాంగ్రెస్

న్యూఢిల్లీ/బెంగళూరు, మార్చి 15: ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బీజేపీ అనుసరిస్తున్న అవినీతి వ్యూహాలను బహిర్గతం చేస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. స్వతంత్ర భారతదేశంలోనే ఇది అతిపెద్ద కుంభకోణమని, దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. అప్పటివరకు కాషాయ పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలను నిలిపివేయాలని పేర్కొంది. "అవినీతికి పాల్పడం, పాల్పడనివ్వం.. అని ప్రధాని మోదీ చెబుతారు. కానీ, ఎన్నికల బాండ్ల పేరుతో బీజేపీ నిధులను ఎలా సేకరిస్తోందనే విషయం సుప్రీంకోర్టు బయటపెట్టింది. బడా వ్యాపారవేత్తలు అంత మొత్తంలో ఆ పార్టీకి నిధులు ఎలా సమకూర్చారు? విరాళాలు ఇచ్చిన వారిలో ఎక్కువగా ఈడీ, ఐటీ దాడులను ఎదుర్కొన్నవారే" అని శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. బీజేపీకి వచ్చిన విరాళాలపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలని, అప్పటివరకు ఆ పార్టీ బ్యాంకు ఖాతాలను కూడా స్తంభింపజేయాలని డిమాండ్ చేశారు. 'స్వతంత్ర భారతంలో ఇది అతిపెద్ద కుంభకోణం. సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం మాకు ఉంది. ప్రజా కోర్టుకు వెళ్తాం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. చాలా కంపెనీలు బీజేపీకి ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాయని ఆరోపించారు. టార్గెట్ చేసుకున్న కంపెనీలపై ముందు ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు జరిపిస్తారని.. ఆ తర్వాత వసూళ్లు (ఎన్నికల బాండ్లు) చేపడతారని ధ్వజమెత్తారు. ఎన్నికల బాండ్లు చట్టవిరుద్ధమైన పథకమని, ఇందులో 'క్విడ్ ప్రో కో' ఉందని కపిల్ సిబల్ ఆరోపించారు.

### ఎస్బీఐ 'జాబితా' వెనుక కేంద్ర పెద్దలు



న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఒక్కో రాజకీయ పార్టీకి కార్పొరేట్ కంపెనీలు ఇచ్చిన వివరాలను సవివరంగా వెల్లడించాల్సిందేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడారు. ఎస్బీఐ వెలువరించిన జాబితా వెనుక కేంద్ర పెద్దలున్నారని ఆరోపించారు. దొంగలను కాపాడేందుకే ఎస్బీఐ వివరాలు సరిగా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కార్పొరేట్ కంపెనీలు ఎన్నికల బాండ్ల ద్వారా క్విడ్ ప్రో కోకు పాల్పడ్డాయని ఆరోపించారు.

### కొనుగోలు చేసిన బాండ్లు వర్సెస్ నికర లాభాలు

| కంపెనీ పేరు | కొనుగోలు చేసిన బాండ్లు (రూ.కోట్లలో) | 2019-20 నుంచి 2022-23 వరకు నికర లాభం (రూ.కోట్లలో) |
|---|---|---|
| ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ | 1368 | 215 |
| మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ | 966 | 7509 |
| క్విక్ సప్లయ్ చెయిన్ ప్రైవేట్ లిమిటెడ్ | 410 | 109 |
| వేదాంత లిమిటెడ్ | 400 | 48372 |
| హల్దియా ఎనర్జీ లిమిటెడ్ | 377 | 1274 |
| ఎస్సెల్ మైనింగ్ అండ్ ఐఎస్‌డీఎస్ | 224 | 3700 |
| ఎంకేజే ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ | 192 | 58 |
| మదన్‌లాల్ లిమిటెడ్ | 185 | 10 |
| భారతీ ఎయిర్‌టెల్ సర్వీసెస్ లిమిటెడ్ | 183 | 253 |
| ఉత్కల్ అల్యూమినియా ఇంటర్నేషనల్ | 145 | 3713 |
| జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ | 123 | 18482 |
| టొరెంట్ పవర్ లిమిటెడ్ | 106 | 5076 |
| ఐఎఫ్‌బీ ఆగ్రో ఐఎస్‌డీఎస్ లిమిటెడ్ | 92 | 175 |

# భారీగా విరాళాలిచ్చింది వీళ్లే

## గనులు, విద్యుత్, ఇన్‌ఫ్రా సంస్థలదే అగ్రస్థానం.. విరివిగా నిధులిచ్చిన హైదరాబాద్ మౌలిక, ఫార్మారంగం




న్యూఢిల్లీ, మార్చి 15: రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చిన సంస్థల్లో మౌలిక సదుపాయాలు, గనులు, విద్యుత్ కర్మాగారాల సంస్థలే అగ్రస్థానంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా అయిదేళ్ల వ్యవధిలో రూ.16,500 కోట్లకు పైగా విరాళాలు కంపెనీలు అందజేయగా, హైదరాబాద్‌కు చెందిన ఇన్‌ఫ్రా, ఫార్మా, రియల్ ఎస్టేట్ కంపెనీలు అందులో తమవంతు పాత్ర పోషించాయి. అయితే, అగ్రస్థానంలో ఉన్న పది కంపెనీల్లో హైదరాబాద్ కంపెనీ మేఘా ఇంజనీరింగ్ ఒక్కటే ఉంది.

**1) ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్:** కోయంబత్తూరు రిజిస్టర్డ్ సంస్థ. ఏకంగా 1,368 కోట్ల రూపాయల బాండ్లు కొన్నారు. ఈడీ కేసులున్నాయి. మార్టిన్ లాటరీ ఏజెన్సీస్ అనే పేరుతో కొన్నాళ్లు నడిచింది. యజమాని మార్టిన్ చాలాకాలంలో దేశంలో కెల్లా అత్యధిక పన్ను చెల్లింపుదారుగా ఉన్నారు. నిర్మాణం, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు ఉన్నాయి. కంపెనీ వార్షికాదాయం 16,500 కోట్లు.

**2) మేఘా ఇంజనీరింగ్:** హైదరాబాద్ కంపెనీ. 966 కోట్ల విరాళాలు ఇచ్చింది. దాని అనుబంధ సంస్థ టాప్ -10లో ఏడో స్థానంలో ఉన్న వెస్టర్న్ యూపీ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మరో 220 కోట్లు ఇచ్చింది. టన్నెళ్లు, రైల్వే మౌలిక సదుపాయాలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణంలో ప్రసిద్ధి. హిమాలయాల్లో జోజిల్లా రోడ్ టన్నెల్ నిర్మాణం చేస్తోంది.

**3) క్విక్ సప్లయి చైన్:** ఇది ముంబైకి చెందిన లాజిస్టిక్స్ కంపెనీ. ఏకంగా 410 కోట్లు రాజకీయ పార్టీలకు విరాళంగా ఇచ్చింది. 2000 సంవత్సరంలో 130 కోట్ల మూలధనంతో ఏర్పాటు చేశారు. గోదాములతో పాటు మానవ వనరుల నిర్వహణ కూడా చేస్తోంది. 2021-22లో కేవలం రూ.21 కోట్ల ఆదాయం ఉన్న ఈ సంస్థ ఆ సంవత్సరం ఏకంగా 360 కోట్ల విరాళం ఇచ్చింది. దీని కేంద్ర కార్యాలయం నవీ ముంబైలోని ధీరూభాయ్ అంబానీ నాలెడ్జి పార్క్‌లో ఉంది. దాని డైరెక్టర్లు కూడా రిలయన్స్ ఇతర కంపెనీల్లో డైరెక్టర్లుగా ఉన్నారు. పైగా, దేశంలోని అతి పెద్ద కంపెనీల్లో ఒకటైన రిలయన్స్ ఎలాంటి విరాళాలు ఇవ్వలేదు. 410 కోట్లు రిలయన్స్ విరాళాలేనని వార్తలు వచ్చిన నేపథ్యంలో క్విక్ సప్లయి చైన్ తమ అనుబంధ సంస్థ కాదని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది.

**4) వేదాంత:** అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంత 401 కోట్లు ఇచ్చింది. పలు రకాల గనుల వ్యాపారం ఉంది. బ్రిటన్ సంస్థకు అనుబంధ సంస్థ. గ్రూప్‌ను ఆరు భాగాలుగా విభజించే క్రమంలో ఉంది.

**5) హల్దియా ఎనర్జీ:** బెంగాల్లోని హల్దియాలో భారీ థర్మల్ విద్యుత్ కర్మాగారాలు నిర్వహిస్తున్న హల్దియా గ్రూపు 377 కోట్ల విరాళాలు ఇచ్చింది. గోయంకా కుటుంబానికి చెందిన ఈ సంస్థకు మోహన్ బగాన్ ఫుట్‌బాల్ జట్టు, ఐపీఎల్ లఖ్‌నవూ జట్టు ఉన్నాయి. ఇ

**6) ఎస్సెల్ మైనింగ్:** దేశంలో అతిపెద్ద ప్రైవేటు బొగ్గు గనుల సంస్థ. 225 కోట్లు విరాళాలుగా ఇచ్చింది. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందినది.

**7) వెస్టర్న్ యూపీ పవర్:** దేశంలో అతిపెద్ద విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ. 220 కోట్ల విరాళం ఇచ్చింది. ఇది మేఘా అనుబంధ సంస్థ.

**8) భారతి ఎయిర్‌టెల్:** జియో తర్వాత దేశంలో అతిపెద్ద టెలికం సంస్థ. 198 కోట్ల విరాళాలు ఇచ్చింది.

**9) కెవ్వెంటర్ ఫుడ్ పార్క్:** బెంగాల్లో ఆహారం, పాల ఉత్పత్తుల ఎగుమతుల వ్యాపారం ఉంది. 195 కోట్ల విరాళం ఇచ్చింది.

**10) ఎంకేజీ ఎంటర్‌ప్రైజెస్:** బెంగాల్ సంస్థ. స్టీల్ వ్యాపారంలో ఉంది. 192 కోట్లు ఇచ్చింది.

### 162 కోట్లు ఇచ్చింది ఎవరు?

పన్నెండవ స్థానంలో యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉంది. ఏకంగా రూ.162 కోట్ల విరాళం ఇచ్చింది. అయితే, ఘాజియాబాద్‌లోని యశోద, హైదరాబాద్‌లోని యశోద రెండూ ఆ విరాళాలు తమవి కాదని స్పష్టం చేశాయి. యశోద హాస్పిటల్స్ పేరుతో రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చిందెవరనేది తేలాల్సి ఉంది. మరోపక్క ఈడీ దాడులకు గురయిన కంపెనీలే బీజేపీకి భారీగా విరాళాలు ఇచ్చాయని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. తప్పని నిరూపించ దలచుకుంటే విరాళాలు ఇచ్చిన సంస్థల వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేసింది.

### తెలుగు కంపెనీలు

*తెలుగు రాష్ట్రాలతో సంబంధం ఉన్న కొన్ని కంపెనీలు కూడా భారీగానే విరాళాలు ఇచ్చాయి. రెడ్డి ల్యాబ్స్ రూ.80 కోట్లు, నాట్కో ఫార్మా రూ.69 కోట్లు, ఎన్‌సీసీ రూ.60 కోట్లు, దివి ల్యాబ్స్ రూ.55 కోట్లు, నవయుగ రూ.55 కోట్లు, రామ్‌కో సిమెంట్స్ రూ.54 కోట్లు, అరబిందో ఫార్మా రూ.52 కోట్లు, రిత్విక్ ప్రాజెక్టు రూ.45 కోట్లు, అపర్ణ ఎస్టేట్స్ రూ.30 కోట్లు, సన్ ఫార్మా 31 కోట్లు, హెటిరో డ్రగ్స్ రూ.30 కోట్లు, హెటిరో ల్యాబ్స్ రూ.25 కోట్లు, హెటిరో బయో ఫార్మా 5 కోట్లు, హానర్ ల్యాబ్స్ రూ.25 కోట్లు, నూజివీడు సీడ్స్, ప్రభాకర్‌రావు కలిపి రూ.27 కోట్లు, మైహోం రూ.15 కోట్లు, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ రూ.10 కోట్లు, సంధ్య కన్‌స్ట్రక్షన్స్ 13 కోట్లు, నర్రా కన్‌స్ట్రక్షన్స్ రూ.10 కోట్లు, మైహోం ఇన్‌ఫ్రా రూ.10 కోట్లు, భారత్ బయోటెక్ రూ.10 కోట్లు, వంశీరాం బిల్డర్స్ 7 కోట్లు, శ్రీచైతన్య 5 కోట్లు, రాజకీయ పార్టీలకు విరాళాలుగా ఇచ్చాయి. ఫార్మ, హెల్త్‌కేర్ రంగాలే ఏకంగా రూ.900 కోట్ల విరాళాలు ఇచ్చాయి.*

## లోకం తీరు




### ఉష్ణోగ్రతలు

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 38.3 | 17.7 |
| నల్లగొండ | 37.0 | 24.4 |
| నిజామాబాద్ | 37.0 | 22.4 |
| వరంగల్ | 36.0 | 23.5 |
| ఖమ్మం | 36.0 | 24.0 |
| సంగారెడ్డి | 36.0 | 26.0 |
| హైదరాబాద్ | 35.8 | 24.1 |

## విరాళాలకు, ఈడీ దాడులకు సంబంధమే లేదు

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, మార్చి 15: అధికార పార్టీకి అందే ఎన్నికల విరాళాలకు, కేంద్ర దర్యాప్తు సంస్థలు చేసే దాడులకూ ఎలాంటి సంబంధం ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఇలాంటి ఆరోపణలు కేవలం ఊహాగానాలేనని చెప్పారు. "ఈడీ వెళ్లి కంపెనీలపై దాడులు చేస్తే, ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయనుకోవడం పూర్తిగా ఊహాగానమే. ఎన్నికల బాండ్లు కొన్న తర్వాత కూడా ఈడీ దాడులు జరిగిన సందర్భాలు ఉన్నాయి కదా! మరి దాన్నేమంటారు?" అని ఆమె ప్రశ్నించారు. ఇక ఎలక్టోరల్ బాండ్లన్నీ అధికార బీజేపీకే వచ్చాయని చాలా మంది ప్రచారం చేస్తున్నారని.. అది కూడా తప్పని చెప్పారు. కంపెనీలు ప్రాంతీయ పార్టీలకు కూడా విరాళాలు ఇస్తాయని గుర్తుచేశారు. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడ్డారు. గతంలో కంటే ఇది మెరుగైన విధానమేనని పేర్కొన్నారు. గత వ్యవస్థలోనూ లోపాలు ఉన్నాయి కదా? అని నిర్మల ప్రశ్నించారు. గతంలో కంటే మెరుగైనదిగా భావించే మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు.

# మార్టిన్ మోసగాడు.. జాగ్రత్త



- 2019 సెప్టెంబరులో కేంద్రం హెచ్చరిక
- అత్యధికంగా రూ.1,368కోట్ల ఎలక్టోరల్ బాండ్స్ కొన్న లాటరీ కింగ్ మార్టిన్
- కూలీ నుంచి రూ.వేల కోట్లకు అధిపతి

చెన్నై, మార్చి 15: "అతడు మోసగాడు.. జాగ్రత్త..!" ఇది ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి శాంటియాగో మార్టిన్ కార్యకలాపాల గురించి 2019 సెప్టెంబరు 23న కేంద్ర హోం శాఖ పలు రాష్ట్రాలకు చేసిన హెచ్చరిక. ఆ వెంటనే కేవలం 10 రోజుల్లోనే మార్టిన్ వరుసగా ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలు మొదలుపెట్టాడు. ఆ నెలలో ఏకంగా రూ.190 కోట్ల బాండ్లను కొనుగోలు చేశాడు. అప్పటినుంచి ఈ జనవరి దాక రూ.1,368 కోట్ల బాండ్లతో అత్యధికంగా బాండ్స్ కొన్న వ్యక్తిగా నిలిచాడు. మార్టిన్, అతడి సంస్థలపై పన్ను ఎగవేతలు, మనీ ల్యాండరింగ్, మోసం ఆరోపణలు రావడంతో 2011 నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయ పన్ను (ఐటీ) శాఖలు దృష్టిసారించాయి. కోయంబత్తూర్‌లో భూ ఆక్రమణలు, మోసానికి పాల్పడినందుకు కేసులు నమోదయ్యాయి. కేరళలో లాటరీల్లో అక్రమాలను అక్కడి ప్రభుత్వం కేంద్ర హోం శాఖ దృష్టికి తీసుకెళ్లింది. దీంతో కేరళలో అతడి సిక్కిం స్టేట్ లాటరీ కార్యకలాపాలపై నిషేధం విధించింది. మార్టిన్‌పై సీబీఐ కేసులు కూడా ఉన్నాయి. బహుమతి మొత్తాన్ని పెంచి చూపి రూ.వెయ్యి కోట్లకు పైగా అక్రమంగా ఆర్జించారనే కేసు వీటిలో ఒకటి. ఈడీ 2019 ప్రారంభంలోనే ఫ్యూచర్ గేమింగ్ సంస్థపై విచారణ మొదలుపెట్టింది. ఆ ఏడాది జూలైలో రూ.250 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది. 2022 ఏప్రిల్ 2న ఇదే కేసులో మరో రూ.409 కోట్ల చరాస్తులనూ ఫ్రీజ్ చేసింది. ఆ తర్వాత ఐదు రోజుల్లోనే మార్టిన్ సంస్థ ఏకంగా రూ.100 కోట్ల ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయడం గమనార్హం.

### కాగితాలపైనే కార్యాలయాలు

రూ.వేల కోట్ల లావాదేవీలు సాగిస్తూ అంతేస్థాయి విరాళాలు ఇచ్చిన మార్టిన్ వ్యాపార కార్యాలయాన్నీ కాగితాలపైనే అని ఆరోపణలు వస్తున్నాయి. రికార్డుల్లో ఉన్న ప్రకారం పంజాబ్‌లోని లూధియానాలో ఉన్న ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ కార్యాలయ చిరునామాకు వెళ్లగా అక్కడసలు కార్యాలయమే లేదని తేలింది.

### ఆదాయం రూ.215 కోట్లే..

2019-23 మధ్య ఫ్యూచర్ గేమింగ్ సంస్థ ఆదాయం రూ.215 కోట్లే. కానీ, రూ.1,368 కోట్ల బాండ్లను కొనుగోలు చేసింది. 2022లో ఖాతాలు ఫ్రీజ్ చేసినా 2023లో రూ.100 కోట్లను విరాళం ఇచ్చింది. నిరుడు జూలై 6వ తేదీన రూ.100 కోట్ల బాండ్లను కొనుగోలు చేసింది. 2022లోనే రూ.400 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేయగా.. ఖాతాలు ఎలా నిర్వహించింది? విరాళాలు ఎలా ఇచ్చిందనే ప్రశ్నలు వస్తున్నాయి.

### ఇంతకూ ఎవరీ మార్టిన్?

ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి, లాటరీ కింగ్‌గా పేరుగాంచిన మార్టిన్ తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందినవాడు. తొలుత మయన్మార్ రాజధాని యాంగూన్‌లో కూలీగా పనిచేశాడు. 13 ఏళ్ల వయసుకే 'లాటరీ' వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. 1988లో భారత్‌కు తిరిగొచ్చి తమిళనాడులో కార్యకలాపాలు మొదలుపెట్టాడు. కర్ణాటక, కేరళ, బెంగాల్, పంజాబ్, మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాలకు మార్చి నేపాల్, భూటాన్ దేశాలకూ విస్తరించాడు.

# కేరళలో కమల వికాసం ఖాయం



కన్యాకుమారిలో ఓ సభలో మోదీ, నటి రాధిక, శరత్‌కుమార్

పతనంతిట్ట(కేరళ): ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ప్రభుత్వాల అవినీతి, అసమర్థ పాలనలో కేరళ ప్రజలు ఎన్నో కష్టాలు భరించారని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం ఆయన దక్షిణ కేరళలోని పతనంతిట్ట జిల్లాలో గణనీయ ప్రాబల్యం ఉన్న క్రైస్తవ కమ్యూనిటీతో భేటీ అయ్యారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. 'గత ఎన్నికల్లో కేరళ ప్రజలు మమ్మల్ని రెండంకెల ఓట్ల శాతం కలిగిన పార్టీని చేశారు. ఇక్కడ మేం రెండంకెల సీట్ల లక్ష్యాన్ని సాధించే రోజు ఎంతో దూరంలో లేదు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో కమలం వికసించడం ఖాయం" అని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత, మాజీ మంత్రి ఏకే ఆంటోనీ కుమారుడు అనిల్ కె. ఆంటోనీని యువతకు ప్రతినిధిగా మోదీ అభివర్ణించారు. గతేడాది కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన అనిల్ ఆంటోనీ రాబోయే ఎన్నికల్లో పతనంతిట్ట లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తమిళనాడులోని కోయంబత్తూరులో ప్రధాని మోదీ పాల్గొనే రోడ్‌షోకు అనుమతి లేదని అధికారులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆర్ఎస్ పురంలో ప్రధాని మోదీ ఈ నెల 18న బీజేపీ నిర్వహించే రోడ్ షోలో పాల్గొనాల్సి ఉంది. అయితే.. ఇక్కడ 1998లో బాంబు పేలుళ్లు జరిగాయి. ఇక్కడ భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో కోయంబత్తూరు జిల్లా పోలీసులు రోడ్‌షోకు అనుమతించలేదు. అయితే, 4 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించుకునేందుకు మద్రాస్ హైకోర్టు అనుమతి ఇచ్చింది.

# కంటి నిండా కునుకుండట్లే..!!

- దేశంలో పెరుగుతున్న నిద్రలేమి సమస్య
- తగినంత నిద్రపోయేది 27% మందే
- రెస్‌మెడ్ స్లీప్ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవన విధానాలు, పెరుగుతున్న సమస్యలు మనిషికి కంటి నిండా నిద్ర లేకుండా చేస్తున్నాయి. తగినంత నిద్ర లేకపోవడం అనేది శరీరంపై తీవ్ర ప్రభావమే చూపుతుంది. అనేక శారీరక, మానసిక సమస్యలకు కారణమవుతుంది. ఈ నిద్రలేమితో బాధపడుతున్న వారి సంఖ్య దేశంలో నానాటికి అధికమవుతోంది. మన దేశంలో కేవలం 27 శాతం మంది మాత్రమే ప్రతి రోజు రాత్రి వేళ సరిపడా (కనీసం 6 నుంచి 8 గంటలు) నిద్రపోతున్నారు. ప్రపంచ నిద్రా దినోత్సవం సందర్భంగా రెస్‌మెడ్ సంస్థ శుక్రవారం విడుదల చేసిన రెస్‌మెడ్ స్లీప్ సర్వే-2024లో ఈ విషయం వెల్లడైంది. దేశవ్యాప్తంగా 36వేల మందిపై ఈ సర్వే చేశారు. ఇదే సంస్థ 2023లో నిర్వహించిన సర్వేలో సుమారు 80 శాతం మంది తగినంత నిద్రపోతున్నట్లు తేలింది. తాజా గణాంకాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉండడం దేశంలో నిద్రలేమి సమస్య తీవ్రతను తెలియజేస్తున్నాయి. కాగా, పని ఒత్తిడి వల్లే తమకు నిద్ర ఉండడం లేదని సర్వేలో పాల్గొన్నవారిలో 42 శాతం మంది వెల్లడించడం గమనార్హం. దక్షిణాది రాష్ట్రాల్లో 38 శాతం మంది పని ఒత్తిడి వల్ల రాత్రిళ్లు తగినంత సేపు నిద్రపోవడం లేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఇది 42 శాతంగా ఉంది. నిద్రలేమి వల్ల పని ప్రదేశంలో పూర్తి సామర్థ్యం మేరకు పని చేయలేకపోతున్నామని సర్వేలో పాల్గొన్న వారిలో 90 శాతం మంది చెప్పారు. కాగా, రాత్రి మంచం ఎక్కిన తర్వాత సెల్‌ఫోన్ చూడడమనేది చాలా మందికి అలవాటుగా మారిందని, నిద్రలేమికి ఇది ప్రధాన కారణమని భావిస్తున్నారు.

# నేడే ఎన్నికల భేరి




(మొదటి పేజీ తరువాయి)


తేదీలను వెల్లడిస్తుంది. ఆంధ్ర, తెలంగాణల్లో ఏప్రిల్ నెలాఖరులో పోలింగ్ జరగొచ్చని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 97 కోట్ల మంది అర్హులైన ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వారికోసం 12 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 4-5 దశల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగే అవకాశముంది. ఆంధ్ర, అరుణాచల్, సిక్కిం అసెంబ్లీలకు ఒకే దశలో ఎన్నికలు జరుగుతాయంటున్నారు. నక్సల్స్ ప్రభావం కారణంగా ఒడిసాలో గత ఎన్నికల మాదిరిగా నాలుగు దశల్లో జరిగే వీలుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 303, కాంగ్రెస్ 52, డీఎంకే 24, టీఎంసీ 22, వైసీపీ 22, శివసేన 18, జేడీయూ 16, బీజేడీ 12, బీఎస్పీ 10, టీఆర్ఎస్ 9 సీట్లు గెలిచాయి. ఈ దఫా లోక్‌సభ ఎన్నికలు విపక్ష ఇండియా కూటమికి జీవన్మరణ సమస్యగా మారాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వివిధ సర్వేలు ఎన్డీయే హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని, బీజేపీ సొంతంగా 350 స్థానాలు కైవసం చేసుకుంటుందని అంచనా వేయడంతో అధికార కూటమి సమరోత్సాహంతో ఉంది. కాగా, బీజేపీ ఇప్పటికే 267 మంది అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ కూడా 82 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. టీఎంసీ బెంగాల్, అస్సోంలలో పోటీచేసే 47 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆప్, ఎస్పీ కూడా పలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి.

### కమిషనర్ల నియామకాలపై స్టేకు నో

సీజేఐని సెలెక్ట్ ప్యానెల్ నుంచి తప్పించి అందులో ఒక కేంద్ర మంత్రిని నియమించేలా 2023లో చేసిన చట్టం ఆధారంగా జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూలను కొత్త ఎన్నికల కమిషనర్లుగా నియమించడంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సాధారణంగా మధ్యంతర ఉత్తర్వుల ద్వారా ఏ చట్టాన్నీ కోర్టు నిలిపివేయదని వ్యాఖ్యానించింది. కొత్త కమిషనర్ల నియామక చట్టాన్ని, జ్ఞానేశ్, సంధూల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీం ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. కొత్త కమిషనర్ల నియామకం కోసం సెలెక్ట్ కమిటీ సమావేశాన్ని ముందుకు జరిపారని పిటిషనర్లలో ఒకరైన జయా ఠాకూర్ తరఫు సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ ప్రస్తావించారు. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదావేసింది.

# భారత నేవీ మాజీ చీఫ్ రాందాస్ ఇకలేరు

- నేడు తిరుమలగిరిలో అంత్యక్రియలు.. రాందాస్ మృతి పట్ల సీఎం రేవంత్ సంతాపం



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళ మాజీ అధిపతి అడ్మిరల్(రిటైర్డ్) లక్ష్మీనారాయణ్ రాందాస్ (90)ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం సికింద్రాబాద్ మిలటరీ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. 1933 సెప్టెంబరు5న ముంబైలో జన్మించిన రాందాస్.. 1953 నుంచి 1993 వరకు భారత నౌకా దళంలో వివిధ హోదాలో విశిష్ట సేవలందించారు. 1971లో భారత్-పాక్ యుద్ధంలోనూ నౌకాదళ అధికారిగా రాందాస్ ముఖ్య పాత్ర పోషించారు. అందుకుగాను ఆయన్ను భారత ప్రభుత్వం వీర్ చక్ర అవార్డుతో సత్కరించింది. 1990 జనవరి 30న 13వ భారత నౌకాదళ అధిపతిగా బాధ్యతలు చేపట్టిన రాందాస్.. పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. నౌకాదళంలో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించి చరిత్రలో నిలిచారు. రాందాస్ అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలోని స్వర్గ వాటికలో జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాందాస్ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

# యడియూరప్పపై పోక్సో కేసు

బెంగళూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ సీఎం యడియూరప్పపై బెంగళూరు నగరం సదాశివనగర్ పోలీసుస్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. మైనర్ అయిన తన కూతురుపై ఫిబ్రవరి 2న యడియూరప్ప లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని బాలిక తల్లి గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయం కోసం కూతురుతో కలిసి వెళ్లానని, యడియూరప్ప తమతో 9 నిమిషాలపాటు మాట్లాడారని, ఆ తర్వాత బాలికను గదిలోకి తీసుకెళ్లి లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. గది నుంచి బయటకు వచ్చిన యడియూరప్ప క్షమాపణలు చెప్పారని, ఎవరికీ చెప్పవద్దని భయపెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు పోక్సో చట్టం 8, ఐపీసీ సెక్షన్ 354(ఎ) కింద కేసు నమోదు చేశారు. ఈ విషయమై యడియూరప్ప శుక్రవారం బెంగళూరులో స్పందించారు. తమకు అన్యాయం జరిగిందని తల్లీకూతుళ్లు నెలన్నర కిందట తన ఇంటికి వచ్చి కన్నీరు పెట్టుకున్నారని, కొంత ఆర్థిక సాయం చేసి, నగర పోలీసు కమిషనర్‌కు ఫోన్ చేసి వారికి న్యాయం చేయాలని సూచించానని అన్నారు. ఈ కేసును చట్టపరంగా ఎదుర్కొంటానని, అంతకు మించి మాట్లాడేది ఏమీ లేదని అన్నారు. కాగా ఈ కేసు విచారణను సీఐడీకి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు డీజీపీ అలోక్‌మోహన్ తెలిపారు.

### సీఏఏపై 19న సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టంపై (సీఏఏ) దాఖలైన పిటిషన్లను ఈ నెల 19న విచారించనున్నట్టు సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. సీఏఏ అమలుపై స్టే విధించాలంటూ కేరళకు చెందిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ఈ నెల 12న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ విషయాన్ని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా.. "2019 నుంచి ఇప్పటి వరకు సుమారు 195 పిటిషన్లు వచ్చాయి. మంగళవారం దీనిపై వాదనలు వింటాం. అన్నింటినీ కలిపి విచారిస్తాం" అని ధర్మాసనం తెలిపింది. సీఏఏను వ్యతిరేకిస్తున్న ఇండియా కూటమి నేతల వైఖరికి నిరసనగా ఢిల్లీలో మొదలైన ఆందోళనలు వరుసగా రెండోరోజూ కొనసాగాయి.

### 'ఫ్రీ సింబల్'పై ఈసీ విధానాన్ని పరిశీలిస్తాం

న్యూఢిల్లీ, మార్చి 15: గుర్తింపు పొందని రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఇచ్చే 'ఫ్రీ సింబల్'(ఎన్నికల గుర్తు) విధానాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. 'ఎవరు ముందు వస్తే వారికి ముందు' అనే విధానంలో గుర్తింపు పొందని పార్టీలకు ఈసీ ఎన్నికల గుర్తులు కేటాయిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ తమిళనాడుకు చెందిన గుర్తింపు పొందని పార్టీ 'నామ్ తమిళర్ కట్చి' సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిని విచారణకు స్వీకరించిన కోర్టు... దీనిపై స్పందించాలని కోరుతూ శుక్రవారం ఈసీకి నోటీసులు జారీ చేసింది.

## ఏప్రిల్ లోపు బియ్యాన్ని చేరవేయాలి


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 15 : 2021- 22 సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్ రైసును అందించడంలో డిఫాల్ట్ అయిన మిల్లర్లు ఏప్రిల్ మాసంలోపు బియ్యాన్ని చేరవేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 2021-22 సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్ రైసును గడువులోగా పౌర సరఫరాల సంస్థకు అందించిన నేపథ్యంలో జిల్లాలో కొందరు రైసు మిల్లర్లను డిఫాల్టర్లుగా ఉండిపోయారన్నారు. ఇలాంటి రైస్ మిల్లర్లు సమయాన్ని విధిస్తూ పెండింగ్ సీఎంఆర్ రైసును ఏప్రిల్ మాసాంతపు లోపు పౌర సరఫరాల సంస్థకు వందశాతం చేరవేసేలా చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ సుగుణ బాయి, రైస్ మిల్లర్ల జిల్లా అధ్యక్షుడు బాలేష్ గుప్తా, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## మర్పల్లిలో జాబ్‌మేళా


మర్పల్లిలో జాబ్ మేళాకు హాజరైన యువకులు

మర్పల్లి, మార్చి 15: కొండామాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మర్పల్లి యంసీఎం ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువకులు జాబ్‌మేళాలో పాల్గొని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రాములు, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

## ఆరెంజ్ బౌల్ వద్ద రోడ్డు పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌పీవో సాంబిరెడ్డి

శామీర్‌పేట, మార్చి 15: శామీర్‌పేట ఆరెంజ్ బౌల్ వద్ద రోడ్డును డీఎల్ పీవో సాంబిరెడ్డి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. 25 సంవత్సరాలుగా ఉన్న రోడ్డును కె.జయరెడ్డి, కె.రాజారెడ్డి, ఎల్‌కే మహేశ్‌రెడ్డిలు ధ్వంసం చేశారని ప్రజావాణిలో రాజశేఖర్ ఫిర్యాదు చేయడంతో డీపీవో ఆదేశాల మేరకు డీఎల్‌పీవో పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ప్రజావాణిలో ఫిర్యాదు రావడంతో డీపీవో ఆదేశాల మేరకు రోడ్డును పరిశీలించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట పంచాయతీ కార్యదర్శి మౌనిక, పంచాయతీ సిబ్బంది శ్రావణ్, కోటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయంపాలన దినోత్సవం


గాయత్రి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

బొంరాస్‌పేట్, మార్చి 15: దుద్యాల మండలంలోని పోలెపల్లి శ్రీగాయత్రి పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎంగా మణికుమార్, ఎంఈవోగా మాధురి, డీఈవోగా సిద్ధార్థ్‌తో పాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రమేశ్‌గౌడ్, ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కొడంగల్:** మండలంలోని రావుల్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామలమ్మ మాట్లాడుతూ రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతలక్ష్మీ, వెంకటేశం, మత్యప్ప, అశోక్‌కుమార్, గీత, నరేందర్, శ్రీవాణి, అంజ్యానాయక్, శుక్లాదేవి, భ్రమరాంబ, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న దివ్యజ్యోతి

కీసర, మార్చి15: రైతులు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవసాయ అధికారిని దివ్యజ్యోతి అన్నారు. శుక్రవారం మండల పరిధి యాద్గార్‌పల్లి రైతు వేదికలో రాజేంద్ర నగర్ వ్యవసాయ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవసాయ అధికారిణి దివ్యజ్యోతి రైతులకు సేంద్రియ వ్యవసాయపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యజ్యోతి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో, అధిక దిగుబడు పొందవచ్చన్నారు. ఆవుపేడ, ఆవు మూత్రం ఔషద గుణాలను దివ్యజ్యోతి రైతులకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మీ, వ్యవసాయ అధికారులు మాదవీలత, వందన, రైతులు కొండల్‌రెడ్డి, జూపల్లి కృష్ణ, మచ్చ విజయ్ కూమార్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వికారాబాద్ ఆర్డీవోగా వాసుచంద్ర

వికారాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ ఆర్డీవోగా ఎం.వాసుచంద్రను నియమిస్తూ రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీచేశారు. వికారాబాద్ ఆర్డీవో విజయకుమారిని ఏటూరు నాగారం (గిరిజన సంక్షేమం) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ కాగా, ఆమె స్థానంలో పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్‌ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కాగా, వికారాబాద్ ఆర్డీవోగా నియామకమైన మధుమోహన్‌ను నారాయణపేట ఆర్డీవోగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. నారాయణపేట ఆర్డీవో ఎం.వాసుచంద్రను వికారాబాద్ ఆర్డీవోగా నియమించారు. పరిపాలనా పరమైన కారణాలతో ఈ మార్పులు చేసినట్లు నవీన్ మిట్టల్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# 16 కార్పొరేషన్ల ఏర్పాటు అభినందనీయం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రమేష్

తాండూరు: మార్చి 15: రాష్ట్రంలో 16 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర క్యాబినేట్ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ధన్యవాద కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే ప్రసంగించారు. ఎన్నికల సమయంలో ముదిరాజ్‌లకు హామీఇచ్చిన ప్రకారం ముదిరాజ్ భవన నిర్మాణానికి భూమి కేటాయింపు జరుగుతుందని తెలిపారు. స్థానిక సంస్థలతో పాటు జిల్లాస్థాయి వరకు ముదిరాజ్‌లకు రాజకీయంగా అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఇందిరమ్మ కమిటీలలో ప్రతీ గ్రామం నుంచి ఒకరికి ముదిరాజ్‌లకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ మాట్లాడుతూ బీసీ శ్మశాన వాటిక నిర్మాణానికి త్వరలో పనులు చేపట్టాలని కోరారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ముదిరాజ్‌లు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు రమేష్, ముదిరాజ్ సంఘం ప్రతినిధులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్వప్న, మాజీ కౌన్సిలర్ పరిమళ, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఉత్తమ్‌చంద్, లొంక నర్సింహులు, రాములు, రాజ్‌కుమార్, బంటు వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఇక నుంచి పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు

మేడ్చల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణాలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఇక నుంచి పలు పనుల నిర్వహణ బాధ్యతలను మహిళా స్వయం సహాయక సంఘాలు చేపట్టనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతో పాఠశాలల్లో నిర్వహణ బాధ్యతలను చేపట్టనున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలిగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. గ్రామంలో రెండు మూడు మహిళా సంఘాలు ఉంటే పాఠశాలకు దగ్గరగా ఉన్న మహిళాసంఘానికి మొదటి సంవత్సరం అవకాశం కల్పిస్తారు. కమిటీ అధ్యక్షుడు, మెంబర్, కన్వీనర్ కలిసి పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లుల కమిటీ సభ్యులుగా ఎంపిక చేస్తారు. రెండు సంవత్సరాల పాటు పాఠశాల నిర్వహణ కమిటీ ఉంటుంది. అమ్మపాఠశాల నిర్వహణ కమిటీకి ప్రత్యేక బ్యాంక్ ఖాతా కూడా ఉంటుంది.

### కమిటీలు చేసే పనులు

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు పాఠశాలల్లో పలు పనులు చేపట్టనున్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేస్తున్న ఈ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు విద్య, పాఠశాల నిర్వహణలో పాలు పంచుకోనున్నాయి. పాఠశాల పర్యవేక్షణ, బలోపేతం చేయడం, తాగునీటి సౌకర్యాలు, మరమ్మతులు, విద్యార్థులకు మరుగుదొడ్ల నిర్మాణం, పాతవి పునరుద్ధరణ, తరగతి గదుల విద్యుద్దీకరణ, పాఠశాల ప్రాంగణంలో పారిశుధ్యం నిర్వహణ, విద్యుత్తు బిల్లులు తగ్గించేందుకు సోలార్ పానెళ్ల ఏర్పాటు, విద్యార్థుల యూనిఫాం కుట్టుపని చేపట్టాల్సి ఉంటుంది. గ్రామాల్లో గ్రామసమాఖ్య, పట్టణాల్లో ఏరియా సమాఖ్య అధ్యక్షురాలు అమ్మ ఆదర్శ కమిటీకి అధ్యక్షురాలిగా ఉంటారు.

## బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం


బ్రిడ్జి పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మర్పల్లి, మార్చి 15: మండలంలోని కోటమర్పల్లి నుంచి చిట్టెంపల్లి రోడ్డు మార్గంలో రూ.70లక్షలతో బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం కోట మర్పల్లి గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ అవస్థలను గుర్తించి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.70లక్షలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర యూత్ కార్యదర్శి అఖిల్‌రెడ్డి, మాల మాదిగ ఉపకులాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంత్‌రామ్, మర్పల్లి సొసైటీ డైరెక్టర్ మల్లారెడ్డి, యువజన నాయకులు అంజి, పాషా, మొగులయ్య, విఠల్ పాల్గొన్నారు.

# 24 నుంచి మైలారం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


మైలారం వేంకటేశ్వరస్వామి ఆలయం

దోమ, మార్చి 15: మండలంలోని మైలారం వేంకటేశ్వరస్వామి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ముడావత్ రాములు నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, వాస్తుపూజ, వాస్తు హోమంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అదేవిధంగా 25న సుప్రభాతం, నిత్య ఆరాధన, సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్టి, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ, నిత్య హోమం, తీర్థ ప్రసాద గోష్టి, సాయంకాలర్చన, నిత్యహవనం, ఊంజల్ సేవ, తీర్థ ప్రసాదగోష్టి, 26న సుప్రభాతం, నిత్య ఆరాధన, సేవాకాలం, తీర్థ ప్రసాదగోష్టి, నిత్యహవనం, విశేషఅభిషేకం, తీర్థ ప్రసాద గోష్టి, సాయంకాలర్చన, నిత్యహవనం, ఊంజల్ సేవ, తీర్థ ప్రసాద గోష్టి, 27న సుప్రభాతం, నిత్య ఆరాధాన, సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్టి, నిత్యహోమం, విశేష అభిషేకం, మహాపూర్ణాహుతి, శ్రీవారి కల్యాణోత్సవం, చక్రస్నానం, స్వామివారి పల్లకీసేవ, ధ్వజారోహనం, శ్రీపుష్పయాగం తదితర పూజలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

## గ్రామాభివృద్ధికి కృషిచేయాలి


వజ్రేష్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎదులాబాద్ గ్రామస్తులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 15: గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని ఎదులాబాద్ గ్రామస్తులు శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం రూ. 50 లక్షల నిధులు మంజూరు చేయించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. మరో రూ.50లక్షలు నిధులు ఇస్తే పాఠశాలలో మొత్తం గదుల నిర్మాణం పూర్తి అవుతుందని ఎదులాబాద్ గ్రామస్తులు కోరారు. లక్ష్మీనారాయణ చెరువులో కలుషిత నీరు కలుస్తుందని, కాలుష్యనివారణకు తగిన చర్యలు తీసుకునే విధంగా కృషిచేయాలని వజ్రేష్‌యాదవ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాజీసర్పంచ్ యాదగిరి యాదవ్, కాంగ్రెస్ నాయకులు విశ్వనాథం, అమర్, ముత్యాల్ యాదవ్, సత్తయ్య, కృష్ణ, మెట్టు నర్సింహ, రమేష్, ఓం ప్రకాష్, బాలకృష్ణ, మశ్చేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా ఆరెమైసమ్మ జాతర


బోనాలతో బయల్దేరిన మహిళలు

పెద్దేముల్, మార్చి 15: మారెపల్లి గ్రామంలో ఆరెమైసమ్మ జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. మండలంలోని మారెపల్లి గేటువద్ద గల ఆరెమైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలతో బయలుదేరారు. గ్రామంలోని ప్రధానవీధులగుండా డప్పువాయిద్యాల మధ్య మహిళలు, గ్రామస్తులు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి బయలుదేరి నైవేద్యాలు సమర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ బలవంత్‌రెడ్డి, భూపతిప్రతాప్‌రెడ్డి, సాయిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

### ఇప్పయిపల్లిలో ఎల్లమ్మ బోనాలు

కులకచర్ల, మార్చి 15: మండలంలోని ఇప్పయిపల్లి గ్రామంలో ఎల్లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నుంచి పోతురాజుల విన్యాసాలతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.


ఇప్పయిపల్లిలో ఎల్లమ్మ బోనాల ఊరేగింపు

# గోనూరులో సీసీరోడ్డు పనులు ప్రారంభం


గోనూరు గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు నర్సిరెడ్డి, ఉదయ భాస్కర్‌రెడ్డి

తాండూరు రూరల్, మార్చి 15: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సిరెడ్డి, ఉదయ భాస్కర్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని గోనూరు గ్రామంలో శుక్రవారం రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని బోనమ్మ దేవాలయం నుంచి సంత్‌లాల్ బసప్ప పొలం వరకు రూ.5లక్షలు, బొడ్రాయి నుంచి హనుమాన్ దేవాలయం వరకు రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో గ్రామం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. గతంలో తమ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధులు రాలేవని, ప్రస్తుతం ఎమ్మెల్యే రూ.10లక్షలు నిధులు అందించడంతో కొంతమేరకు సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, ఉదయభాస్కర్‌రెడ్డి, మున్నప్ప, సత్యనారాయణ, చాకలి వెంకటయ్య, చంద్రప్ప, అనంత్‌రెడ్డి, ఆనంద్, మల్లికార్జున్, రాఘవేందర్, బాలప్ప, బిచ్చప్ప పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

● **కొడంగల్:** కొడంగల్ మండల ఎంపీపీ ముద్దప్పదేశ్ ముఖ్ జన్మదిన వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎంపీపీ స్థానిక శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కటకం శివకుమార్‌గుప్త, జయతీర్థచారి, నందారం శ్రీనివాస్, రత్నం, మురారి వశిష్ట పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను తూంకుంటకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు కాసుల ఈశ్వర్‌గౌడ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుంచి ఈటెల రాజేందర్ భారీ మెజార్టీతో గెలువడ ఖాయమని ధీమావ్యక్తం చేశారు. బీజేపీ నాయకులతో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాధవరెడ్డి, కాసుల బాబుగౌడ్, శ్రీధర్‌రెడ్డి, దీపక్ పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** ఉద్యోగం పొందినప్పుడే పదవీ విరమణ తేదీ నిర్ణయించ బడుతుందని ఎంఈవో రాంరెడ్డి, యూటీఎఫ్ మండల నాయకులు అన్నారు. శుక్రవారం బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసిన ప్రధానోపాధ్యాయుడు పాపిరెడ్డి సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల నాయకులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు వెంకటయ్య, గౌరారం గోపాల్, ఎస్.మల్లేశ్, లక్ష్మి, నరేందర్‌గౌడ్, హలీముద్దీన్, జ్యోతి, గుంజ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్ దేవరయాంజాల్ జడ్పీ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు శ్రద్ధతో చదవి పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు తీసుకరావాలని సూచించారు. అలియాబాద్ జడ్పీ పాఠశాలలో బండి రాఘవరెడ్డి మెమోరియల్‌ట్రస్ట్ సభ్యుడు బండి రాంరెడ్డి పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు హాల్‌టికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి, అక్షిత, శ్రీకాంత్, రుచిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

యాలాల, మార్చి 15: ఈనెల 18 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయనున్నట్లు యాలాల ఎంఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 715మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో 347మంది బాలురు, 368మంది బాలికలు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మండలంలోని యాలాల, అగ్గనూర్, ప్రతిభ, గౌతమి పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

## మానవ సేవే మాధవసేవ


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, మార్చి 15: మానవసేవే మాదవ సేవ అని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి రోడ్డులో సందీప్ మెడికల్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, సందీప్, ప్రవీణ్, విజయ్, నరేందర్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి


ప్రేమ్‌కుమార్ (ఫైల్)

ధారూరు, మార్చి 15: వరి పంటకు నీళ్లు పారించేందుకు వెళ్లిన ఓ రైతు మొరాయిస్తున్న మోటారుకు మరమ్మతు చేస్తూ విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని నాగారంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు మద్దులపల్లి ప్రేమ్‌కుమార్(34) వరి పంటకు నీళ్లు పారించేందుకు శుక్రవారం పొలానికి వెళ్లాడు. వరి పంటకు నీళ్లు పారిస్తుండగా మోటారు మొరాయించింది. దీంతో ప్రేమ్ కుమార్ వాగులోకి దిగి మోటార్‌ను సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు మోటారుకు విద్యుత్ ఎర్తింగ్ కావడంతో షాక్ తగిలి పొలంలో పడిపోయాడు. గమనించిన చుట్టు పక్కల పొలాల రైతులు ప్రేమ్ కుమార్‌ను బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వికారాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అసుపత్రిలో చికిత్స పొదుతూ ఆయన మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ చెప్పారు.

## నీళ్ల ట్యాంకర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

● నలుగురికి స్వల్ప గాయాలు


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

మూడుచింతలపల్లి, మార్చి 15: రాజీవ్ రహదారిపై డివైడర్‌పై మొక్కలకు నీళ్లు పోస్తున్న నీళ్ల ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటన తుర్కపల్లిలోని జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో సికింద్రాబాద్ వెళ్తోంది. శామీర్‌పేట్ మండలంలోని లాల్‌గడి మలక్‌పేట్ పరిధిలోకి రాగానే బస్సు అదుపుతప్పి నీళ్ల ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురుకి గాయాలయ్యాయి. విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

పరిగి, మార్చి 15: లారీ ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం పరిగి మండలం సయ్యద్ మల్కాపూర్ శివారులో చోటుచేసుకుంది. మద్గుల్‌చిట్టెంపల్లి గ్రామానికి చెందిన డి.శ్రీనివాస్(40), పరిగి మండలం రాఘవాపూర్ వైపు నుంచి పరిగికి వస్తుండగా, సయ్యద్‌మల్కాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

## రెస్టారెంట్ సిబ్బందిపై దాడి

● నలుగురిపై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 15: ఓ రెస్టారెంట్ సిబ్బందిపై దాడిచేసిన ఘనటలో నలుగురిపై కేసు నమోదైంది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అవుషాపూర్‌లోని తీన్మార్ రెస్టారెంట్‌పై గురువారం రాత్రి అదేగ్రామానికి చెందిన కొట్టే అఖిల్‌రెడ్డి, అవినాష్, అనుదీప్, మణదీప్‌లు హలీమ్ తీనడానికి వచ్చారు. హలీమ్ ఇవ్వమని సిబ్బందికి ఆర్డర్ చేసి తర్వాత అదనపు ప్లేట్ కావాలని అడిగారు. అదనపు ప్లేట్ తీసుకు రావడంలో ఆలస్యమైందని కొట్టే అఖిల్‌రెడ్డి, అవినాష్, అనుదీప్, మణదీప్‌లు అక్కడున్న సామగ్రిని పగులగొట్టి సిబ్బందిపై దాడికి దిగారు. రెస్టారెంట్‌లో నానా బీభత్సం సృష్టించారు. సిబ్బందిపై పిడిగుద్దులు, కట్టెలతో దాడిచేశారు. వారు తట్టుకోలేక బయటకు పరుగులు తీశారు. తీన్మార్ రెస్టారెంట్ నిర్వాహకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

## పట్టుబడిన అక్రమ కలప డీసీఎం

బొంరాస్‌పేట్, మార్చి 15: ఎలాంటి అనుమతులు లేకుండా కలపను తరలిస్తున్న డీసీఎంను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి నమ్మదగిన సమాచారం మేరకు బొంరాస్‌పేట్‌లోని మేడిచెట్టు తండా శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా కలపను తరలిస్తున్న డీసీఎంను పట్టుకొని డ్రైవర్ కె.అంజిలయ్యపై కేసు నమోదు చేసినట్లు బొంరాస్‌పేట్ పోలీసులు తెలిపారు.

## ఇసుక వేలం

కులకచర్ల, మార్చి 15: మండలంలోని అనంతసాగర్ గ్రామంలో పట్టుబడిన ఇసుకను శనివారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ మురళీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వే నెం.90, 91లలో 17 ట్రాక్టర్ల ఇసుకను అనుమతి లేకుండా నిల్వ ఉంచగా సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్‌చేసిన ఇసుకను ఉదయం 11గంటలకు గ్రామ పరిధిలో వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొని ఇసుకను దక్కించుకోవాలన్నారు.

## గుప్త నిధుల కోసం క్షుద్రపూజలు

● పలువురిపై కేసు నమోదు

కులకచర్ల, మార్చి 15: గుప్త నిధుల కోసం క్షుద్రపూజలు చేస్తున్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు. కులకచర్ల పంచాయతీ కార్యాలయం పక్కన ఓఇంట్లో గురువారం మధ్యాహ్నం క్షుద్రపూజలు చేస్తుండగా అనంతయ్య, సుదర్శన్, రాము, శివ, శ్రీనివాస్, అర్జున్‌లను పట్టుకున్నారు. విచారణలో జరిపి గుప్త నిధుల కోసం క్షుద్రపూజలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## అసెంబ్లీ స్పీకర్‌పై ఆరోపణలను సహించం

మర్పల్లి, మార్చి 15: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల సోషల్ మీడియాలో లేనిపోని ఆరోపణలు చేస్తే సహించమని కాంగ్రెస్ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షుడు రవీందర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం నియోజకవర్గానికి చెందిన ఓ మహిళ ఆరోగ్య పరిస్థితిపై వికారాబాద్ డీఎం అండ్ హెచ్‌వోట ఫోన్‌లో సంభాషించిన ఆడియో క్లిప్స్‌లను కొంత మంది బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారంతో సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారన్నారు. వెంటనే వారి పద్ధతి మార్చుకోకపోతే ఊరుకునేది లేదన్నారు. అహర్నిషలు నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం పాటు పడే స్పీకర్ పట్ల తప్పుడు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోం అన్నారు.

## శ్రీశైలానికి భక్తుల పాదయాత్ర

కొడంగల్, మార్చి 15: నారాయణ్‌ఖేడ్, సంగారెడ్డి పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు మూడు రోజుల కిందట శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్ర ప్రారంభించారు. శుక్రవారం కొడంగల్ పట్టణానికి చేరుకున్న వారు శ్రీ మహాదేవ శివాలయం ఆవరణలో కొంత సమయం విశ్రాంతి తీసుకున్నారు. హిరేమఠ్ ధనాసిరి మఠాధిపతులు శ్రీ వీరేశ్వర్ శివాచార్యుల ఆధ్వర్యంలో పాదయాత్రగా బయలుదేరుతున్నట్లు భక్తులు తెలిపారు. ఏటా శివరాత్రి తర్వాత వచ్చే బుధవారం పాదయాత్ర ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతీ రోజు 30 నుంచి 40 కిలో మీటర్ల నడకతో 15 రోజుల్లో శ్రీశైలం చేరుకుంటామని తెలిపారు.

## విద్యార్థులు లక్ష్యంతో చదవాలి


సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొడంగల్, మార్చి 15: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని ఎంఈవో రాంరెడ్డి విద్యార్థులకు సూచించారు. కొడంగల్ పట్టణంలోని బాలాజీ నగర్‌లో గల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంఈవో రాంరెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఓ లక్ష్యంతో విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, పరమేశ్వరమ్మ, అబ్దుల్ హక్, వెంకటేశం, సాలిబాయి పాల్గొన్నారు.